క్లుప్తంగా

మేటి క్రీడాకారులను తీర్చిదిద్దడమే ధ్యేయం



క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న దాతలు

చినగంజాం: కబడ్డీలో మేటి అయిన క్రీడాకారులను తీర్చి దిద్దడమే తన ధ్యేయం అని అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, బాల కోటేశ్వర స్పోర్ట్స్ (కబడ్డీ) క్లబ్ వ్యవస్థాపకుడు ఎం గిరిబాబు అన్నారు. వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ క్రీడాకారులను తయారు చేయడమే ధ్యేయంగా తమ కబడ్డీ క్లబ్ పనిచేస్తుందని, ఇందులో భాగంగా ప్రతి ఏడాది వేసవిలో చినగంజాంలో ఉచితంగా కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెలిపారు. ఈ పాటికే తమ క్లబ్ తరపున కబడ్డీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో కబడ్డీ జట్టులో ఆడి విజయం సాధించారన్నారు. ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో తమ క్లబ్ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచి కప్ సాధించారన్నారు. క్లబ్ తరపున ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరం మే 1 నుంచి జూన్ 9 వ తేదీ వరకు 40 రోజులపాటు నిర్వహించామని, మొత్తం 60 మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణా సమయంలో క్రీడాకారులకు గుడ్లు, అరటి పళ్లు, పాలు పౌష్టికాహారంగా ఉదయం సాయంత్రం అందించామన్నారు. శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు పీఈటీ మున్నం శ్రీనివాస రెడ్డి జ్ఞాపకార్థం ఆయన మేనల్లుడు పోలీస్‌లుగా విధులు నిర్వహిస్తున్న మూలగాని శ్రీనివాసరెడ్డి, బోగిరెడ్డి నాగాంజనేయ రెడ్డిలు 60 మంది క్రీడాకారులకు క్రీడాదుస్తులు సమకూర్చి అందజేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో సీనియర్ చెడుగుడు క్రీడాకారులు కుంచాల సుబ్బరామిరెడ్డి, ఆసోది వెంకారెడ్డి, ఆట్ల ముసలారెడ్డి ఘనంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులతో పాటు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సముద్రంలో యువకుడు గల్లంతు



గల్లంతయిన యువకుడి స్నేహితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాల: స్నేహితులతో కలిసి సముద్ర స్నానం చేయడానికి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతయ్యాడు. ఈఘటన రామాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. చీరాల మండలం కావూరివారిపాలేనికి చెందిన జైపాల్ (18) మరికొంతమంది స్నేహితులతో కలిసి సముద్ర తీరానికి వచ్చాడు. ఈ క్రమంలో సముద్రంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు అలల తాకిడికి కొట్టుకుపోయాడు. ఆదివారం రాత్రి వరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అతని ఆచూకీ లభ్యం కాలేదు.

కూరగాయల సాగు భళా

- గ్రామాల్లో ఆశాజనకంగా పూలు, ఆకు, కూరగాయల సాగు
- మంచి ధరలు అవకాశం



పాత చీరాలలో వంకాయ మొక్కలను పెంచుతున్న రైతులు

చీరాల టౌన్: చిన్న, సన్నకార రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆకు కూరలు, పూల మెక్కల సాగు ఆదుకుంటున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోని ఇసుక నేలలు ఉన్న సన్నకారు రైతులు పూల తోటలు, ఆకుకూరలు సాగుచేస్తూ కుటుంబానికి తోడ్పాటు అందిస్తున్నారు. చీరాల రూరల్ మండలంలోని ఇసుక భూములు ఉన్న ఈపురుపాలెం లోని బోయినవారిపాలెం, సావరపాలెం, బుర్లవారిపాలెం, కావూరివారిపాలెం, పాత చీరాల, చీరాలనగర్ గ్రామపంచాయతీల్లో ఉన్న చిన్నకారు రైతులు ఆకుకూరలు, కూరగాయలు, పూలతోటలను పెంపకం చేస్తున్నారు. తమకున్న కొద్దిపాటి ఇసుక నేలలో ఆకుకూరలు, పూలమొక్కలు, పూల దండలలో ఉపయోగించే లైనాకు పంటలను సాగుచేస్తూ కుటుంబానికి ఆర్థిక చేయూతనిస్తున్నారు. ఆకు కూరలు, పూలమొక్కలు, బెండ, కాకర, పచ్చిమిర్చి, వంకాయలు, టమాటా, దొండకాయలను సాగు చేస్తూ చక్కగా రాణిస్తున్నారు. మండలంలోని బుర్లవారిపాలెం, పాత చీరాల, కొత్తపాలెం గ్రామ పంచాయతీల్లో ఆకుకూరలు, గులాబీలు, మల్లెతోట, వంకాయలు, దొండకాయలు, కాకర, కనకాంబరాలు, నాటు, హైబ్రిడ్ గులాబీ వంటి పూల తోటలను సాగుచేస్తుంటారు. వీటితోపాటు తోటకూర, పెరుగు తోటకూర, మెంతుకూర, పూలదండలలో ఉపయోగించే లైనాకు పంటలను విద్యుత్ మోటార్ల సహాయంతో పండిస్తూ కుటుంబ పోషణకు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారు. వీటిసాగుకు కేవలం మూడున్నర నెలలు మాత్రమే పడుతుండటంతో ఈపంటలను సాగుచేసేందుకు ఈగ్రామాల్లోని చిన్నకారు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఆకుకూరలు, కూరగాయల మొక్కల సాగుకు అవసరమైన విత్తనాలను వెదుళ్లపల్లి నుంచి తీసుకువచ్చి రెండు పూటలా విద్యుత్ మోటారు సహాయంతో నీళ్లను అందించి పంటలను పండిస్తున్నారు. కావూరివారిపాలెంలో పండించిన పూలు, లైనాకును గుంటూరు, విజయవాడ, హైద్రాబాద్ వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ గ్రామాల్లో పండించిన కూరగాయలను చీరాల కూరగాయల మార్కెట్‌తో పాటుగా ఈపూరుపాలెం, దేవాంగపురి, వేటపాలెం మార్కెట్లకు రైతులు తరలించి అమ్మకాలు చేస్తున్నారు.



బోయినవారిపాలెంలో ఆశాజనకంగా సాగుతున్న పచ్చిమిర్చి పంట



బుర్లవారిపాలెంలో సాగవుతున్న వివిధ రకాల ఆకుకూరలు

పంటలు బాగా పండేలా దీవించు తల్లీ ..



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండి రైతులు, కౌలు రైతులు సుభీక్షంగా వర్ధిల్లాలని గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మ తల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్లు సమర్పించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి నైవేద్యములు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని



కారంచేడులో భజనలు నిర్వహిస్తున్న మహిళలు

దర్శించుకోవడానికి గ్రామ ఆడపడుచులతో పాటు, గ్రామస్తులు, చీరాల, పర్చూరు, ఇంకొల్లు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలు సుభీక్షంగా ఉండాలని భక్తులు మొక్కుబడులు చేసుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదములను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

పెద బజారు శివాలయంలో శివనామ స్మరణలు..

గ్రామంలోని పెద బాజరు సెంటర్‌లో వందల సంవత్సరాల క్రితం ఏర్పాటు అయిన శివాలయంలో ఆదివారం గ్రామస్తులు పెద్ద ఎత్తున్న భజనలు నిర్వహించారు. మహిళలు, పురుషులు బృందాలుగా ఏర్పడి స్వామివారి శివనామ స్మరణలు, భజజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.



వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సందడిగా వాడరేవు సముద్ర తీరం

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. వేసవి సెలవులు ముగింపు, ఆదివారం కావటంతో వివిధ గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటుగా తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెదిన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి తీరంలో సరదాగా గడిపారు. దీంతో వాడరేవులో కోలాహలం నెలకొంది.

అటు ఆరోగ్యం.. ఇటు సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న వాకర్స్ ప్రతినిధులు

చీరాల రూరల్: ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఆరుపదుల వయస్సులో మన వాకర్స్ ప్రతిరోజు క్రమం తప్పకుండా ఒకవైపు వాకింగ్ చేస్తు మరోవైపు సేవా కార్యక్రమాలు సమపాళ్లలో నిర్వహించడం ఎంతో మంచి పరిణామమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వాకర్స్ ఇంటరేషనల్, ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో వాకర్స్ అసోసియేషన్ జిల్లా రెండో కేబినెట్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వీ మురళి మోహనరావు, డిస్ట్రిక్టు 203 గవర్నర్ పి. శ్రీనివాసులురెడ్డి, ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య, నేతాజి సుబ్బారెడ్డి, డాక్టర్ ఇస్తర్ల బాబురావు, డాక్టర్ గడ్డం పృథ్వీ పాల్గొని ఎంతో విలువైన సందేశాలు అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్‌లో చేరిన నాటినుంచి అసోసియేషన్‌లో సభ్యుల సభ్యత్వాలను పెంచుకుంటూ ఎంతో క్రమశిక్షణతో ప్రతిరోజు వాగింగ్, వ్యాయామాలు చేస్తు దాంతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. అలానే అసోసియేషకు చక్కని సహకారమందిస్తున్న అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, సెక్రటరి చారుగుళ్ల గురు ప్రసాద్, ట్రెజరర్ గొడవర్తి సుధాకర్, ఇతర సభ్యులను వారు అభినందించారు. ఈరోజు వివాహ వార్షికోత్సవాలు జరుపుకుంటున్న వాకర్స్ సభ్యులకు వేద పండితులతో అతిథుల మధ్య ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన వాకర్స్ ప్రతినిధులు అధిక సంఖ్యలో వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకు చేతివృత్తులు దోహదం



శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సభ్యులు

పర్చూరు (చినగంజాం): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చేతి వృత్తులు ఎంతగానో దోహదం చేస్తాయని మహిళా సామాజిక వేత్త నర్రా లక్ష్మీ సుధ అన్నారు. పర్చూరు రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనం నందు ఉచిత ఫ్యాబ్రిక్ డిజైనింగ్ , పెయింటింగ్ శిక్షణా శిబిరాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చేతివృత్తుల పట్ల నైపుణ్యం పెంపొందించుకోవాలని అది మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. మహిళలు ఎక్కువ మంది శిక్షణ కార్యక్రమానికి హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ అడ్వకేట్ కొల్లా నరేంద్ర కుమార్ కోరారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, కుట్టు శిక్షణా నిపుణురాలు దగ్గుబాటి రాజ్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాంబ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో రేణుకాంబ అమ్మవారు

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో కొలువై ఉన్న జంపని వంశీయుల ఇలవేల్పు రేణుకాంబ అమ్మవారి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న జంపాని వంశీయులు హాజరై అమ్మవారికి విశేషపూజలు, పాలపొంగళ్లు, పసుపు కుంకుమలు, సారె సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు, శాంతి క్రతువులు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వేసవి దుక్కులతో లాభం



దున్నకానికి సిద్ధంగా ఉన్న దుక్కి



ట్రాక్టర్‌తో చదును చేస్తున్న రైతు

- దుక్కులతో పంటకు హానిచేసే తెగుళ్ల నివారణ
- పంటలకు విరివిగా పోషకాలు
- పెరగనున్న నేల సారం

జే.పంగులూరు: వేసవిలో పంట భూములు లోతుగా దుక్కులు దున్నటం వలన అన్ని విధాలుగా మేలు కలుగుతుందని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు. గతంలో వేసవి కాలంలో ముఖ్యంగా మండుటెండల్లో నాగలితో దుక్కులు దున్నేవారు. దానితో తెగుళ్ల తక్కువగా ఉండేవి. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 మధ్య కనీసం ఒక నెల పాటు పల్లం, మిట్ట అనే తేడా లేకుండా భూమిని ఖాళీగా ఉంచి దుక్కులు దున్నటం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.

హానిచేసే పురుగుల నివారణ..

భూమి పైభాగం ఆరిపోయిన లోపలి భాగం తేమగా ఉంటుంది. అదే ట్రాక్టర్‌తో, నాగలితో దున్నటం వలన నేల రెండు అడుగులు మేర తిరగబడి లోపలి భాగం పైకి వస్తుంది. తద్వారా లోపల హానిచేసే పురుగులు బయటం పడి ఎండ తీవ్రతకు నశిస్తాయి. కాండం కుళ్ల తెగుళ్లకు కారకాలైన పురుగులు, గుడ్లు పొదిగి నేలలో ఉండటం వలన వచ్చే పంటల్లో మళ్లీ వ్యాప్తిచెంది పైర్లు నాశనం చేస్తాయి. వేసవి దుక్కులు దున్నటం వల్ల తెగుళ్ల జాతికి చేందిన పురుగులు బయటం పడి వేడికి చనిపోవటం లేదా పక్షులు తినటంతో తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. అంతేకాక లోపల పోషకాలపైకి రావటంతో పంటలకు దోహదపడతాయి. అలాగే మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు, కలుపు మొక్కలు ఎండకు ఎండిపోయి వాటి సమస్య తగ్గిపోవటంతో పాటు నేల సారవంతమవుతుంది.

ఎత్తుపల్లాలు ఉండవు..

దుక్కులు దున్నడం వాటిని సరిచేయటంవలన ఎత్తు పల్లాలు సరిచేసుకోవడానికి అవకాశం ఉంటుంది. పల్లం మెట్ట భూములకు నీరు పెట్టినప్పుడు, ఆ నీటి ద్వారా ఎరువుల సరఫరా చేసినప్పుడు పల్లంలోనే ఉండిపోకుండా చేనంతా సమాంతరంగా ఉండాలి. అందుకు వేసవి దుక్కులు దున్ని ఎత్తు, పల్లాలు సరిచేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

> **అధిక దిగుబడులు సాధించవచ్చు..**
> వేసవి దుక్కులు దున్నటం వలన తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చు. ఫలితంగా తగ్గుతుంది. తద్వారా నేల కూడా సారవంతం అవుతుంది. దిగుబడులు కూడా పెరుగుతాయి. గత సంవత్సరం రైతులు మిర్చి పంట తెగుళ్లతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనుక ప్రతి ఒక్కరూ ఈ పద్ధతి ఆచరిస్తే తెగుళ్ల చాలావరకు నివారించవచ్చన్నారు. అంతేకాక పంట మార్పిడి కూడా చాలా అవసరం అని తెలిపారు. అంతర పంటల వైపు కూడా రైతులు మొగ్గు చూపాలని తెలిపారు.
> – ఏఓ సుబ్బారెడ్డి

రోటరీ ఆధ్వర్యంలో వృత్తి సాఫల్య పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న వారితో క్లబ్ నిర్వాహకులు

మార్టూరు: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృత్తిని కేవలం ఉపాధి కోసమే కాకుండా నిబద్ధత అంకితభావాలతో సామాజిక బాధ్యతగా సేవలందించే వారిని గుర్తించి వారికి వృత్తి సాఫల్య పురస్కారాలను అందజేశారు. స్థానిక ఎఫెక్ట్ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న మేడికొండ నిర్మల, రెక్కల కష్టంతో కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న దంపతులు అడపా మల్లేష్, ఊర్వశిలు, మార్టూరు స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా సేవలందిస్తున్న లెనిన్ బాబులకు పురస్కారాలు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు ఇతర రోటరీ ప్రతినిధులు అతిథులను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఫెక్ట్ డైరెక్టర్ జేవీ మోహన్‌రావు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, బసవ రాములు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి 120 మంది హాజరు



రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి పరీక్షలు

జే.పంగులూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఆదివారం పంగులూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 120 మంది హాజరైనట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతురావు, కాలేషా వలి తెలిపారు. వీరిలో 70 మంది శుక్లాల ఆపరేషన్ కోసం ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. శిబిరం పంగులూరులోని రోటరీ భవనం వద్ద ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా క్యాంప్ ఇన్‌చార్జ్ చిలుకూరి వీరరాఘవయ్య మాట్లాడుతూ శుక్లాల ఆపరేషన్ల చేసేందుకు ఎంపిక చేసిన సోమవారం రోటరీ భవన్ వద్దకు వస్తే అక్కడ నుంచి ఉచిత బస్సు ఏర్పాటు చేస్తున్నామని, ఆపరేషన్ అయిన అనంతరం తిరిగి పంగులూరులో వదిలి పెడతామని తెలిపారు. రోటరీ క్లబ్ ద్వారా 17 ఏళ్ల నుంచి వేలాది మంది పేదలకు శుక్లాల ఆపరేషన్ చేయించి కంటి చూపును పొందేటట్లు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పంగులూరు సభ్యులు ఇమ్మడి శెట్టి సుబ్బారావు, జాగర్లమూడి సుబ్బారావు, పోతిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు సత్కారం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల రూరల్: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జూనియర్స్ ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులను ఆదివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జూనియర్స్ జట్టు జోనల్ పోటీలలో అన్ని జట్లపై నెగ్గిందన్నారు. మూడు రోజులు క్రితం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని నాలుగో స్థానంలో జట్టు క్రీడాకారులు నిలిచారని చెప్పారు. జట్టులో అందరూ చిన్నవారైనప్పటికి ఉత్తమ ప్రతిభకనబరచడం ఎంతో అభినందనీయమని క్రీడాకారులను కొనియాడారు. భవిష్యత్‌లో అనేకమైన పోటీలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బొనిగల ప్రేమయ్య, రిటైర్డు ఎన్‌సీసీ అధికారి సాల్మన్‌రాజు, జోనల్ కోఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు, కోచ్‌లు ప్రసన్న, నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా లీలాకుమారి



సంఘపెద్దలతో మహిళా అధ్యక్షురాలు

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సొలస లీలా కుమారిని స్థానిక సంఘ కార్యాలయంలో సంఘపెద్దలు ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లీలాకుమారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ మహిళలను చైతన్యవంతులను చేస్తూ అభ్యున్నతికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి కోటి లింగాచారి, చోడ వెంకట సుబ్బారావు, ఆళ్లగడ్డవీర సుందరాచారి, ఏలూరి వీర బ్రహ్మచారి, దర్శి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ కమిటీ కన్వీనర్ తువ్వపాటి జనార్దనాచారి, సంఘ నాయకులు పాల్గొన్నారు.